నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, ఆదివారం 14 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI

ముగిసిన టెన్త్ మూల్యాంకనం

- నల్లగొండలో 2లక్షలకు పైగా జవాబు పత్రాల వాల్యుయేషన్ పూర్తి

రామగిరి, ఏప్రిల్ 13 : పదో తరగతి వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం ముగిసింది. నల్లగొండలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం కేంద్రం ఏర్పాటు చేయగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2లక్షలకు పైగా ఆయా సబ్జెక్టులకు చెందిన జవాబు పత్రాలు వచ్చాయి. ఈ నెల 3నుంచి 13వరకు మూల్యాంకనం క్యాంపు అధికారి, డీఈఓ బి.భిక్షపతి నిత్యం పర్యవేక్షిస్తూ మూల్యాంకనాన్ని విజయవంతంగా పూర్తి చేయించారు. క్యాంపులో 88 మంది చీఫ్ ఎగ్జామినర్స్, 538 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 182మంది స్పెషల్ అసిస్టెంట్స్‌తోపాటు పలువురు అధికారులు మొత్తం 1000మందికి పైగా పనిచేశారు. మూల్యాంకనం ఉత్తర్వులు పొంది విధులకు హాజరుకాని ఉపాధ్యాయులపై డీఈఓ భిక్షపతి షోకాజ్ నోటీసులు జారీచేసి కలెక్టర్‌కు సమస్య వివరించడంతో ఆ తర్వాత అంతా హాజరయ్యారు. సంపూర్ణంగా మూల్యాంకనం ముగియడంతో ఉపాధ్యాయులందరికీ డీఈఓ ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు

- 123 రోజులైనా అమలు కానీ హామీలు
- కృత్రిమ కరువు తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టిన సర్కారు
- సాగు, తాగునీటి సమస్యతో అల్లాడుతున్న జనం
- కేసీఆర్ జోలికొస్తే గులాబీ సైన్యం చూస్తూ ఊరుకోదు
- బీఆర్ఎస్ గెలుపుతోనే అన్ని వర్గాలకు ప్రయోజనం
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- ఆలేరులో బీఆర్ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం

ఆలేరు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నేతలు, నర్సింహారెడ్డి, హరిశంకర్‌గౌడ్ తదితరులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్13 : డిసెంబర్ 9వ తేదీన 420 హామీలను అమలు చేస్తామని చెప్పి, 123 రోజులైనా అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తారో.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 24 గంటల విద్యుత్, రైతు బంధు, ఇంటింటికీ ఉచితంగా స్వచ్ఛమైన మిషన్ భగీరథ తాగునీటిని అందజేసి, ప్రజలు, రైతుల కోసం నిరంతరం పాటుపడే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తారో జనం తేల్చుకునే రోజు వచ్చిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గ్యారెంటీలేమో గానీ కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాంతానికి కరువును తీసుకొచ్చిందని మండిపడ్డారు. ఆలేరు పట్టణంలోని ప్రకాశ్‌గార్డెన్‌లో శనివారం పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. అంతకుముందు నకిరేకల్‌లో నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి రైతులకు రుణమాఫీ, మహిళలకు రూ. 2,500, విద్యార్థులకు స్కూటీ, రైతుబంధు, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి రూ.15 వేలు వచ్చాయో అడిగి వస్తే కాంగ్రెస్‌కు, ఒకవేళ రాకపోతే బీఆర్ఎస్ పార్టీ కారుగుర్తుకు ఓటెయ్యాలని అడుగాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు రైతు బంధు ఇవ్వక, ఎకరానికి రూ. 500 బోనస్ ఇవ్వక, పండించిన పంటలను కొనుగోలు చేయక రైతుల నెత్తురు తాగి అధికార కాంగ్రెస్ పార్టీ ఢిల్లీకి కప్పం కడుతున్నదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టే లేదని, పిల్లర్లు కుంగిపోయాయనే సాకుతో సాగు నీరు ఇవ్వక రైతులకు కరువును తెచ్చిందన్నారు. 2014 కంటే ముందు పరిస్థితులు గ్రామాల్లో వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. వందరోజులుగా రాష్ట్రంలో ఒక మాయాజాలం నడుస్తున్నదని, డిటెక్టివ్ నవలగా రాష్ట్రం కనబడుతున్నదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కుంగిపోయిందని, ఫోన్ ట్యాపింగ్ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి కథలతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఇంత జరిగినా ఫోన్ ట్యాపింగ్‌లో ఏమీ లేదని, ఇప్పటి వరకు ఏం జరిగిందో చెప్పలేదని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి నాటకాలకు తెరతీశారని అన్నారు. గ్రామాల్లో దొంగతనాలు, పుస్తెల తాడు చోరీలు పెరిగాయని, ఎక్కడ చూసినా మంచినీళ్లు లేక ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. సాగునీరు లేక రైతులు పంటలు ఎండబెట్టుకునే పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల పక్షాన నిలబడిన మాజీ సీఎం కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని, ప్రజలకు ఓపిక నశించిందని, కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని తెలిపారు.

కేసీఆర్ బయటకు వస్తే చలనం మొదలైంది

నీళ్లు లేక తీవ్ర అన్యాయం జరిగిందని, మీరే మాకు దిక్కని రైతులు వేడుకుంటే చలించిన మాజీ సీఎం కేసీఆర్ బయటకువచ్చి రైతు పక్షాన నిలబడ్డారని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం చేసిన మోసాన్ని రైతులు వివరిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి బ్యాచ్‌కు చలనం మొదలైందన్నారు. వెంటనే కాళేశ్వరం జలాలను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. 100 రోజుల్లో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రభుత్వం వారికి అండగా నిలువాలని కోరారు. ధాన్యం క్వింటాకు రూ. 500 బోనస్, రూ. 2 లక్షల రూణమాఫీ, రైతు బంధు ఇవ్వాలని ప్రభుత్వానికి మాజీ సీఎం కేసీఆర్ లేఖ రాశారని, ఎన్నికల కమిషన్‌కు లేఖ ఇస్తే తాము మద్దతిస్తామని చెప్పినా కాంగ్రెస్ సర్కారు నుంచి సమాధానం లేదన్నారు. కేసీఆర్‌పై సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి బట్టలూడదీస్తానని అనడం సిగ్గు చేటన్నారు. మరోసారి కేసీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే 50 లక్షల గులాబీ సైన్యం చూస్తూ ఊరుకోరని తెలిపారు. కేసీఆర్ బయటకు రాగానే కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకుందన్నారు. ఎప్పటికైనా ఈ రాష్ట్రానికి కేసీఆర్ శ్రీరామరక్ష అని వెల్లడించారు.

క్యామ మల్లేశ్‌ను ఆదరించండి

బీఆర్ఎస్ బడుగుబలహీన వర్గాల పార్టీ అని, బడుగు బలహీన నాయకుడు, ఉద్యమ నేత బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలువాలని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. క్యామ మల్లేశ్ కష్టపడి పైకి వచ్చారని, పేదల బాధలు తెలిసిన వ్యక్తి అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కనాడు కూడా పార్లమెంట్‌లో మాట్లాడింది లేదని విమర్శించారు. ఈ రాష్ట్రం కోసం, ప్రజల కోసం కొట్లాడింది, రేపు పార్లమెంట్‌లో కొట్లాడేది బీఆర్ఎస్ పార్టీ ఎంపీలేనని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తొట్ల స్వామి యాదవ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి తుంగ బాలు, మదర్‌డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ వివిధ మండలాల మండలాధ్యక్షులు గంగుల శ్రీనివాస్, కర్రె వెంకటయ్య, ఖలీల్, పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశ్‌గౌడ్, ఎంపీపీలు గోపగాని బాలమణియాదగిరిగౌడ్, తాండ్ర అమరావతి, జడ్పీటీసీలు చామకూర గోపాల్‌గౌడ్, తోట కూర అనూరాధ, కోలుకొండ లక్ష్మీరాములు, పీఏసీఎస్ చైర్మన్లు మొగులగాని మల్లేశంగౌడ్, ఇమ్మడి రాంరెడ్డి, మాజీ సర్పంచులు బక్క రాంప్రసాద్, ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వడ్ల నవ్య శోభన్‌బాబు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు ఆడెపు బాలస్వామి, పంతం కృష్ణ పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

లక్ష్మీనృసింహస్వామి దయతో విజయం నాదే..

అబద్ధాల హామీలు ఇచ్చి పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని, శ్రీరాముడి పేరుతో ఈ ప్రాంతానికి రూపాయి కూడా ఇవ్వని బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దయతో భారీ మెజార్టీతో విజయం నాదే. కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతున్నాడన్న భయంతో మునుగోడు ఎమ్మెల్యే వద్ద మోకరిల్లే పరిస్థితిలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారు. ప్రజల పక్షాన నిలిచే పార్టీ బీఆర్ఎస్. 2014లో ఇద్దరు ఎంపీలతో కేంద్రంతో కొట్లాడి రాష్ట్రాన్ని సాధించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీది. అలాంటి పార్టీని ఓడించి తప్పు చేశామని ప్రజలు పునరాలోచనలో పడ్డారు. విజన్ ఉన్న నేత మాజీ సీఎం కేసీఆర్‌కు అండగా నిలువాలని నిర్ణయానికి వచ్చారు. ప్రతి ఒక్కరూ క్యామ మల్లేశ్‌గా మారి ప్రచారం చేయాలి.

– క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి

క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి. మల్లేశ్ గెలిస్తే కార్యకర్తలకు అండగా నిలుస్తారు. కాంగ్రెస్ వైఫల్యాలను గడపగడపకు వివరించి బీఆర్ఎస్ గెలుపు కోసం కృషి చేయాలి.

–ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జడ్పీ చైర్మన్

నమ్మితే నట్టేట ముంచారు

రైతాంగం కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటేస్తే నట్టేట ముంచింది. కేసీఆర్ పాలనలో పసిడి పంటలు పండాయి. నేడు పంటలకు సాగు నీరు, సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత రోజులు వచ్చాయి. క్యాడర్ లేని బీజేపీ అభ్యర్థికి డిపాజిట్ గల్లంతవడం, భువనగిరి ఖిలాపై గులాబీ జెండా ఎగురడం ఖాయం. కాంగ్రెస్ నాయకుల తాటాకుల చప్పుళ్లకు బెదిరేది లేదు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం. బీఆర్ఎస్ కుటుంబ సభ్యులు సమన్వయంతో పనిచేసి బడుగు, బలహీన వర్గాల అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

– గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్

కన్నీళ్లు మిగిల్చిన కాంగ్రెస్ పాలన

మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులకు కన్నీళ్లే మిగిల్చింది. కాంగ్రెస్ 120 రోజుల పాలనలో అంతా కరువుతో అల్లాడుతున్నారు. రైతు బీమా, రైతుబంధు పథకాలను అందించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్‌నే కోరుకుంటున్నారు. క్యామ మల్లేశ్‌కు ఆలేరు నియోజకవర్గం నుంచి 50వేల మెజార్టీ అందించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి.

– గొంగిడి మహేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలి

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో బొంద పెట్టాలి. ఎంపీ స్థానాల్లో ఒక్క సీటు కేటాయించకుండా బహుజనుల ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పార్టీ తాకట్టు పెట్టింది. ఈ ఎన్నికల్లో బహుజనులంతా ఏకమై కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి.

– బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే

ఆటుపోట్లు ఉంటయ్.. అయినా కష్టపడుదాం

ఎన్నికల్లో ఆటుపోట్లు ఉంటయ్.. అయినా నిరుత్సాహపడకుండా కష్టపడుదాం. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపిద్దాం. చంద్రబాబు కనుసైగల్లో నడిచే వ్యక్తి రేవంత్‌రెడ్డి. ఆనాడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నాగార్జునసాగర్ ఎండిపోయింది. ఈనాడు శిష్యుడు రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నడు.. ఏ పల్లెకు పోయినా నీళ్లు లేక, పంటలు పండక కరువు విలయతాండవం చేస్తుంది. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితుల్లో లేరు. మళ్లీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నరు. నకిరేకల్ సెంటర్‌లో చిరుమర్తి లింగయ్య నిర్మించిన సర్కిల్‌ను కూల్చేశారు. 100 పడకల ఆస్పత్రిని కూడా కూల్చేస్తారా? బీఆర్ఎస్ కార్యకర్తలపై దౌర్జన్యం చేస్తూ పోలీసులతో కొట్టిస్తున్నారు. వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలు నెరవేర్చలేదు. ఎంపీ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. ఇక హామీలను నెరవేర్చేదెన్నడు. ప్రజలకు మాయమాటలు చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్నారు. కానీ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలందరం కలిసి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం.

– చిరుమర్తి లింగయ్య, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే

సూర్యాపేట మార్కెట్‌లో ధాన్యం రాశులు

సూర్యాపేట మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- అందని మద్దతు ధర

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 13 : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం పోటెత్తుతుంది. మార్కెట్‌కు నిత్యం 50వేల నుంచి 60వేల బస్తాల వరకు రైతులు తీసుకొస్తున్నారు. అయితే.. ధర తక్కువ పడుతుండడం, కాంటాలు, ఎగుమతులకు ఆలస్యం అవుతుండడంతో రైతులకు ఇబ్బంది కాకుండా ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ ఏడాది కూడా టోకెన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. రోజూ 30వేల నుంచి 35వేల బస్తాల వరకు ధాన్యాన్ని అనుమతించేందుకు మార్కెట్ అధికారులు కమీషన్‌దారులకు టోకెన్లు జారీ చేస్తున్నారు. ఆ టోకెన్ల మేరకు శనివారం వ్యవసాయ మార్కెట్‌కు 30,574 బస్తాల ధాన్యం వచ్చింది. అయితే.. ధాన్యం ఎక్కువగా వస్తుండడంతో కొద్ది మంది రైతులకు మాత్రమే మద్దతుకు మించి ధర అందిస్తున్నారు. మిగతా వారికి తాలు, చెత్త, తేమ పేరుతో తక్కువ ధర పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగురు రైతులు 106 బస్తాల పాత బీపీటీ ధాన్యం తీసుకురాగా క్వింటాకు రూ.2709 నుంచి రూ.2,389 వరకు ధర పలికింది. 389 మంది రైతులు 18,800 బస్తాల జైశ్రీరాం రకం ధాన్యం తీసుకురాగా రూ.2,556 నుంచి రూ.1501 ధర పలికింది.

151మంది రైతులు ఐఆర్ 64 రకం ధాన్యం తేగా రూ.1849 నుంచి రూ.1546వరకు, 100 మంది రైతులు హెచ్ఎంటీ ధాన్యం తీసుకురాగా, రూ.2,249 నుంచి రూ.1519 వరకు, ఆర్ఎన్ఆర్ తెచ్చిన ఇద్దరు రైతులకు రూ.1903 నుంచి రూ.1659 ధర పలికింది. ఈ ఏడాది అసలే కాలం కాక పండిన కొద్ది పంటకు కూడా సరైన ధర అందడంలేదని, దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దామరచర్ల మండలం తిమ్మాపురంలో ట్యాంకు నుంచి పైపులైన్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

యుద్ధ ప్రాతిపదికన గ్రామాల్లో నీటి సరఫరా

- నమస్తే కథనానికి స్పందన

దామరచర్ల, ఏప్రిల్ 13 : మండలంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పర్యటించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. ఈ నెల 11వ తేదీన నమస్తే తెలంగాణ పత్రికలో 'పల్లెల్లో నీటి సమస్య' అనే కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సంపత్, ఏఈ రవికిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని రాజగట్టు, కొండ్రపోల్, తిమ్మాపురం, తెట్టకుంట తదితర గ్రామాల్లో నెలకొన్న బోర్లు, పైపులైన్ల సమస్యలను పరిష్కరించారు. లీకేజీలు ఉన్న పైపులను తొలగించి కొత్త పైపులను బిగించి తాగునీటిని అందించారు. దీనితోపాటు నీటి సమస్య ఉన్న మరికొన్ని గ్రామాల్లో కూడా సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో మిషన్ భగీరథ నీరు ప్రతి గ్రామానికీ అందజేస్తున్నామని అధికారులు తెలిపారు. భూగర్భజలాలు అడుగంటడంతో బోర్లలో నీళ్లు లేక రక్షిత నీటి పథకాలు కొన్ని పనిచేయడం లేదని, దాంతో అద్దె బోర్లు తీసుకొని వాటి ద్వారా నీటిని అందజేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు.

ఐకేపీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

ధాన్యానికి బోనస్ ఇవ్వాలి

తుంగతుర్తి, ఏప్రిల్ 13 : అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ధాన్యం క్వింటాకు రూ. 500 బోనస్ ఇవ్వాలని రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. తుంగతుర్తి మండలం బండరామారం ఐకేపీ సెంటర్ వద్ద శనివారం బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు వీరబోయిన రమేశ్, మాజీ సర్పంచ్ గడ్డం ఉప్పలయ్య, ఆకారపు సైదులు, నాయకులు పులుసు ఉప్పలయ్య, సోమనర్సయ్య, దేవేంద్ర, బక్కయ్య, నరేశ్, వీరసోములు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

సమాచార హక్కు చట్టంతో అవినీతి తగ్గుముఖం

- ఉమ్మడి ఏపీ సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 13 : సమాచారం హక్కు చట్టంతో అవినీతి తగ్గుముఖం పట్టిందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. భువనగిరిలోని పెన్షనర్స్ భవన్‌లో సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యదర్శి, సేవా సదన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మేధావులు, విద్యావంతులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి జీఓ ఆన్‌లైన్ విధానంలో అందుబాటులో ఉందని, సమాచారం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలు చైతన్యం పొందేందుకు లోక్‌పాల్ చట్టం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, గృహహింస చట్టం అమల్లోకి వచ్చాయన్నారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఉండేందుకు, అవినీతికి ఆస్కారం లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించేందుకు సమాచార హక్కు చట్టం వచ్చిందన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సమాజంలో జరుగుతున్న అవినీతిని బయటకు తీసేందుకు ఆర్టీఐ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎర్రమాద కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఉండాలంటే ఆర్టీఐ కార్యకర్తలు కీలకమని, త్వరలోనే భువనగిరి నియోజకవర్గంలో ఆర్టీఐ కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పంచాయత్ రాజ్ చీఫ్ ఇంజినీర్ కరీం మాట్లాడుతూ సమాచారం హక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత అధికారుల్లో అవినీతి తగ్గిందన్నారు. సమావేశంలో సేవా సదన్ డైరెక్టర్ మహ్మద్ కుర్షిద్‌పాషా, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, దళిత అధ్యయన వేదిక అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, అజాద్ హింద్ ఫౌజ్ రాష్ట్ర అధ్యక్షుడు ముజీబ్, సభ్యులు ఆకవరం మోహన్‌రావు, సురేశ్, బాలస్వామి, హేమలత, సోం బాబు, జహంగీర్, మహేందర్ పాల్గొన్నారు.

యువతా మేలుకో.. ఓటు నమోదు చేసుకో

- ఓటు నమోదుకు ఈ నెల 15 వరకు గడువు
- 18 ఏండ్లు నిండిన వారు అర్హులు

నేరేడుచర్ల , ఏప్రిల్ 13 : సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు, ప్రజాస్వామ్యంలో ప్రజలు నిజాయితీ సమర్థత గల నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటే వజ్రాయుధం. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటేనే ప్రజాస్వామ్యం పది కాలాల పాటు పరిఢవిల్లుతుంది. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం ఈ నెల 15 వరకు అవకాశం కల్పించింది. జనవరి 31, 2024 వరకు 18 ఏండ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదయ్యేందుకు వీలు కల్పించింది. గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఓటు హక్కును నమోదు చేసుకోని వారు త్వరపడి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గతంలో ఓటు హక్కు పొందిన వారంతా సమీప బూత్ లెవెల్ కేంద్రాల్లోని ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయో, లేదో, తప్పులు ఉన్నాయో అన్న విషయం పరిశీలించుకోవాలన్నారు. జాబితాలో తమ పేర్లు లేకుంటే వెంటనే అక్కడ ఓటు నమోదు చేసుకోవాలి. 01-31-2024 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు చేసుకునేందుకు ఇదే మంచి అవకాశం. ఓటరు ముసాయిదా జాబితా సవరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 18 ఏండ్లు నిండిన యువతీ యవకులు ఫారం-8లో దరఖాస్తు చేసుకోవచ్చు. దాంతో పాటు రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు, రేషన్, ఆధార్ కార్డుతో పాటు వయస్సు ధ్రువీకరణ పత్రం జతచేయాలి.

ఏ ఫారం ఎందుకంటే

- **ఫారం-6 :** కొత్తగా ఓటర్ల నమోదుకు ఫారం-6ను ఉపయోగించాలి. రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్ కార్డు (లేకుంటే నివాస చిరునామ ధ్రువీకరణ పత్రం జతపరచాలి)
- **ఫారం-7 :** ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు కోసం ఫారం-7ను ఉపయోగించాలి. విచారించిన తర్వాత పేర్లు తొలగిస్తారు
- **ఫారం -8 :** పేరు, పుట్టిన తేదీల్లో తప్పులను సవరించేందుకు ఫారం-8ను పూరించి ఇవ్వాలి. ఈ ఫారానికి సరిచేయాల్సిన పేరుకు సంబంధించిన డిక్లరేషన్, 10వ తరగతి మార్కుల జాబితా, డ్రైవింగ్ లైసెన్స్, లేదా ఏదో ఒకటి జతపరుచాలి
- **ఫారం-8ఏ :** చిరునామ మార్చేందుకు ఫారం-8ఏ ను ఉపయోగించాలి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ అయిన వారు పూర్వ చిరునామతో ఉన్న గుర్తింపు కార్డు జిరాక్స్‌ను, ప్రస్తుత చిరునామా ధ్రువీకరణ పత్రాన్ని జతపరిస్తే సరిపోతుంది
- **ఫారం-6ఏ :** ఎన్ఆర్ఐలు ఫారం-6ఏ ను ఉపయోగించాలి. ఇందుకు తాము నివాసముంటున్న దే శాల్లో సిటిజన్ మెంబర్‌షిప్ లేదని, అక్కడి అంబాసిడర్‌తో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది